న్యూ గడ్డిఅన్నారం కాలనీ సమస్యలు పరిష్కరిస్తా..


ఎమ్మెల్యేతో సమావేశమైన న్యూ గడ్డిఅన్నారం కాలనీవాసులు

చైతన్యపురి: గడ్డి అన్నారం డివిజన్‌లోని న్యూ గడ్డి అన్నారం కాలనీలోని సమస్యలు పరిష్కరించడంతో పాటు ముంపు సమస్య లేకుండా చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. న్యూ గడ్డిఅన్నారం కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యేను క్యాంప్ ఆఫీసులో కలిసి తమ సమస్యలు వివరించారు. పక్క డివిజన్ సైదాబాద్ నుంచి వచ్చే నూతన డ్రెయిన్ల నిర్మాణం వల్ల తమ కాలనీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చిన్నపాటి వర్షానికే కాలనీలో డ్రైనేజీ, వరదనీరు రహదారులపై ప్రవహిస్తోందని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, ఎన్నికల కోడ్ వల్ల టెండర్ ప్రక్రియ ఆలస్యమైందని తెలిపారు. త్వరగా టెండర్లు పూర్తి చేసి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తామని, కాలనీవాసులకు ముంపు సమస్యల నుంచి పూర్తిగా విముక్తి కలిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీప్రవీణ్ కుమార్, కాలనీ అధ్యక్షుడు రఘు, ప్రసాద్, రామ్మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాసే చట్టాలను రద్దు చేయాలి


సీఐటీయూ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న చంద్రమోహన్

మన్సూరాబాద్: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) 54వ ఆవిర్భావ వేడుకలు ఆటోనగర్‌లో గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఐక్యత, పోరాటం నినాదంతోనే సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. 54 సంవత్సరాల కాలంలో సీఐటీయూ కార్మిక వర్గ ఐక్యతకు కృషి చేసిందని, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాజీలేని పోరాటం చేసిందని తెలిపారు. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలతో కార్మిక వర్గం అనేక సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. కార్మిక హక్కులను కాలరాసే కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి ఎల్లయ్య, దయానంద్, రాజ్‌కుమార్, నగేష్, కొండల్, సచిన్, రాములు, బాలాజీ, గణపతి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు: కొప్పుల


సీఎస్‌ఆర్ కాలనీలో ట్రంక్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. హయత్‌నగర్ పరిధిలోని సీఎస్‌ఆర్ కాలనీ నుంచి మొదలైన ట్రంక్‌లైన్ పనులను కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎస్ఆర్ కాలనీ నుంచి మొదలైన ట్రంక్‌లైన్‌తో సుమారు 15 కాలనీలకు ఉపయోగపడుతుందని, కొందరు ట్రంక్‌లైన్ పనులకు ఆటంకాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. కొంత మంది కాలనీలవాసులు, నకిలీ జర్నలిస్టులతో కలిసి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. జలమండలి ఉన్నతాధికారులు అన్ని రకాల అనుమతులు తీసుకుని పనులు చేపడుతున్నారని ఆయన తెలిపారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కాలనీవాసుల సహకారం ఉండాలని, మళ్లీ ట్రంక్‌లైన్ పనులను ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాస్మోపాలిటన్ కాలనీలో...

డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గురువారం మార్నింగ్ వాక్ చేపట్టి కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, ఇంట్లోని చెత్తను ఖాళీ ప్రదేశంలో, రోడ్లపై వేయవద్దని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రుద్ర లక్ష్మీనర్సింహ, యుగంధర్‌రెడ్డి, వనం భాస్కర్, గంజి సత్తయ్య, శ్రీనివాసరావు, జైహింద్‌రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలు జరుపుకోవడం అభినందనీయం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామికవేత్త సీబీఆర్ ప్రసాద్‌రావు, పూర్వ ఉపాధ్యాయులు

మహేశ్వరం: ప్రభుత్వం ఐదెకరాల స్థలం చూపిస్తే తన సొంత నిధులు రూ.కోటి 8లక్షలు వెచ్చించి క్రీడా పాఠశాల, కళాశాలను నిర్మిస్తానని పారిశ్రామికవేత్త సీబీఆర్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాల కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అమీర్‌పేట్ గ్రామం చుట్టుపక్కల ప్రభుత్వం ఐదెకరాల భూమి ఇస్తే ఆ స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన క్రీడా పాఠశాల, కళాశాలను నిర్మాణం చేసి గ్రామీణ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అంతకుముందు 1974 పదో తరగతిలో పాఠశాలు బోధించిన ప్రధానోపాధ్యాయులు నారాయణ, రామిరెడ్డిలతో పాటు పూర్వ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్వర్ణోత్సవ కమిటీ అధ్యక్షుడు శివరాజ్, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా గడ్డిఅన్నారం రోడ్లు


గడ్డిఅన్నారం బస్తీ రోడ్డు దుస్థితి ఇదీ


గుంతలు పడి అధ్వానంగా తయారైన దిల్‌సుఖ్‌నగర్ వెంకటాద్రి గల్లీకి వెళ్లే రహదారి

- అభివృద్ధి పనుల పేరిట తవ్వకాలు
- నిత్యం మురుగు పరుగు
- రోడ్ల మరమ్మతుపై అధికారుల నిర్లక్ష్యం
- రాకపోకలకు జనం అవస్థలు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారంలో రోడ్లు అధ్వానంగా మారాయి. అభివృద్ధి పనుల కోసం రోడ్లను తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో గతుకులమయంగా తయారయ్యాయి. అసలే ఇరుకు రోడ్లు...గుంతలు పడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ హాస్టళ్లు, విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు అధికంగా ఉండటం వల్ల గడ్డిఅన్నారం నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనాల రాకపోకల ధాటికి మరింత ధ్వంసమైన ఈ రోడ్లపై ప్రతి రోజూ డ్రైనేజీ వరదలై పారుతోంది. దీంతో రోడ్లు మరింతగా పాడైపోవడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించడానికి తిప్పలు పడుతున్నారు. సరైన మరమ్మతులు లేక మ్యాన్‌హోళ్ల మూతలు రోడ్డుపైకి తేలిన కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు పాడై నెలలు గడుస్తున్నా.. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక్కడ రోడ్లు పాడయ్యాయి..

- గంగా థియేటర్ రోడ్ నుంచి పాత శివాలయం వరకు..
- ప్రభుత్వ పాఠశాల నుంచి బస్తీ దవాఖానా వరకు..
- దిల్‌సుఖ్‌నగర్ వెంకటాద్రి గల్లీకి వెళ్లే దారిలో..
- గడ్డిఅన్నారం బస్తీలో..

రహదారులకు మరమ్మతు చేయించాలి



పాడైన రోడ్లు, మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. అసంపూర్తి అభివృద్ధి పనులతో సమస్యలు మొదలవుతున్నాయి. పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి.. మ్యాన్‌హోళ్ల నిర్మాణ పనులు సరిగా చేయకుండా వదిలేశారు. సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి. తక్షణమే రోడ్లకు మరమ్మతు చేయించాలి.

– బొట్టు శ్రీను, గడ్డిఅన్నారం బస్తీ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శుక్రవారం కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- **ఉ.10.30 నుంచి మ. 12.30 వరకు...** రెడ్‌క్రాస్, గౌతంనగర్, చర్చ్, గడ్డిఅన్నారం, శాంతినగర్, లలితానగర్, మధురాపురి, కృష్ణానగర్, మైత్రీనగర్, లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థా కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పద్మావతి కాలేజ్, సంగం లక్ష్మీబాయి కాలేజ్ పరిసర ప్రాంతాలు.
- **మ.2 నుంచి సా.4 గంటల వరకు...** కరణ్‌బాగ్, జీఏ పార్క్, జీఏ కాలనీ, నియో రాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీహాల్, రామాలయం, పద్మావతి కల్యాణ మండపం, సాయిరాం కాలనీ, పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్ పరిసర ప్రాంతాలు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 23, ఆలు 32, ఉల్లి 26, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 75, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 65, బీట్‌రూట్ 17, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 125, కాప్సికమ్ 50. శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

యోగాతో చెడు అలవాట్లకు చెక్


యోగా శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్మాయిల్ గురూజీ, వాకర్స్

చంపాపేట: విద్యార్థులు యోగాలో శిక్షణ పొందటం వల్ల చెడు అలవాట్లు, మొబైల్‌కు బానిస కావడం వంటి వ్యసనాలకు చెక్ పెట్టవచ్చని గురు నిలయం వ్యవస్థాపకుడు, స్వధర్మ యోగి ఇస్మాయిల్ గురూజీ అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని లోటస్ ల్యాబ్ ఉన్నత పాఠశాలలో గురు నిలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ వాల్ పోస్టర్‌ను ఆయన యోగా సాధకులు, మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ఆవిష్కరించారు. శిక్షణా తరగతులు జూన్ ఒకటి నుంచి పది రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని గురూజీ తెలిపారు. పాల్గొనేవారు ఫోన్ నం. 9603256572లో సంప్రదించాలని కోరారు.

వసతుల లేమి.. సమస్యలే సుమీ!

- పూర్తికాని అదనపు గదుల నిర్మాణం
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- ఇదీ సరూర్‌నగర్ జూనియర్ కళాశాల దుస్థితి



హుడాకాంప్లెక్స్: ఇంటర్మీడియెట్ తరగతులు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నా యి. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ కూడా ప్రా రంభమైంది. ఆర్థికంగా బాగా లేని పేద, మ ధ్య తరగతి పిల్లలు సమీపంలోని సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరు తున్నారు. అయితే అక్కడ విద్యార్థుల నిష్పత్తి మేరకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు, అధ్యాపకుల కొరత కూడా వేధిస్తోంది.

ఉగ్గపట్టుకోవాల్సిందే..

సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల నిష్పత్తి మేరకు తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్ర శాలలు సరిపడా లేవు. అదనపు తరగతులు, మూత్రశాలల నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలో రూ.2.18 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి ఏడాది దాటింది. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆయా పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు ఒంటికి, రెంటికి వెళ్లాలంటే ఉగ్గపట్టుకొని ఉండాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి పరుగులు తీస్తున్నారు. సరిపడా క్లాస్ రూమ్‌లు లేక విద్యార్థులు ఒకే గదిలో 70 మందికి పైగా కూర్చుంటున్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లే దిక్కు..

జిల్లాలో 17 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా, మరో రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. వీటితో పాటు మరో 194 ప్రభుత్వ కార్పొరేట్ కాలేజీలు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ కోర్సుల్లో ఏటా లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 2073 మంది అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. ఇక సరూర్‌నగర్ కాలేజీలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని ఆరు కోర్సుల్లో 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ 22 మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విధులు నిర్వహిస్తున్నారు. పలు సబ్జెక్టులకు నిపుణులు లేకపోవడంతో కాంట్రాక్ట్ లెక్చరర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు: ఏసీపీ


ఆటోనగర్‌లో విత్తనాలను పరిశీలిస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని, నకిలీ విత్తన విక్రేతలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి హెచ్చరించారు. వనస్థలిపురం ఠాణా పరిధి ఆటోనగర్‌లోని పలు గోదాముల్లో నిల్వ ఉన్న వివిధ కంపెనీల విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆటోనగర్‌లోని విత్తన గోదాముల్లో తనిఖీలు చేస్తున్నామని ఏసీపీ కాశిరెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాలు పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ వై.అశోక్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

హోటల్‌లోని సామగ్రి అపహరణ

హయత్‌నగర్: హోటల్‌లోని సామగ్రి అపహరణకు గురైన ఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం... హయత్‌నగర్ వర్డ్ అండ్ డీడ్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఇటీవల విహారి పేరిట హోటల్‌ను ప్రారంభించారు. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి హోటల్‌ను మూసివేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. ముందు భాగంలో వాచ్‌మెన్ పడుకుని ఉండగా, అర్ధరాత్రి వేళ హోటల్ వెనుక నుంచి ఓ వాహనంలో వచ్చిన దుండగులు వంట సామగ్రి, సిలిండర్లు, ఫ్రిజ్, వడ్డింపు సామగ్రి తదితరాలను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం హోటల్ వద్దకు వచ్చిన నిర్వాహకులు ఐతగోని రవిగౌడ్, దాసరి రాజుగౌడ్ హోటల్‌లోని సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపిన పోస్ట్‌మెన్


జెట్టి గజానంద్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో పోస్ట్‌మెన్. జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ జీజే కాలనీకి చెందిన జెట్టి గజానంద్ (50) పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పోస్ట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21 ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆయన తన ఇంట్లో అకస్మాత్తుగా కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఎనిమిది రోజుల పాటు చికిత్స చేసినా స్పందించకపోవడంతో ఈనెల 29న బ్రెయిన్‌డెడ్ అయినట్లు కామినేని వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు గజానంద్ భార్య నవనీత, కుమార్తె దీక్షితకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు గజానంద్ లివర్, ఒక కిడ్నీ, లంగ్స్, కంటి కార్నియాలను జీవన్‌దాన్‌కు దానం చేశారు.

కూతురితో తల్లి అదృశ్యం


కుమార్తెతో తల్లి సంగీత

సైదాబాద్: సోదరి నివాసంలో ఆశ్రయం పొందుతున్న ఓ మహిళ తన కూతురుతో కలిసి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. భర్తతో గొడవ పడిన సంగీత అనే మహిళ తన కూతురు భవిష్యతో కలిసి విష్ణునగర్‌లో నివసించే తన సోదరి, జీహెచ్‌ఎంసీ స్వీపర్ సంపూర్ణ ఇంట్లో నాలుగు నెలలుగా ఆశ్రయం పొందుతూ కొందరి ఇళ్లలో పనిమనిషిగా చేస్తోంది. ఆమె ఈనెల 25న కూతురును తీసుకొని పనులకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో సోదరి ఆమె భర్త ఇంటి వద్ద, బంధువుల ఇంటి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. దాంతో బుధవారం సంపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్ని రోజుల నుంచి తన సోదరితో భర్తతో కలిసి ఉండమని చెప్పటంతో మనస్తాపంతో వెళ్లి ఉంటుందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్ దంపతులకు సన్మానం



బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. బాలాపూర్‌లోని ప్రాచీన శివాలయ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు!

- విద్యార్థుల భవిష్యత్‌తో ప్రైవేట్ పాఠశాలల చెలగాటం
- చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం



సరూర్‌నగర్ ఎంఈఓ కార్యాలయం

దిల్‌సుఖ్‌నగర్: విద్యా సంవత్సరం మొదలవుతుండటంతో ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఊపందుకున్నాయి. గుర్తింపు ఉన్న పాఠశాలలతో పాటు లేని పాఠశాలలు కూడా రకరకాల ప్రకటనలతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి జీఓను విడుదల చేయలేదు. గుర్తింపు లేని పాఠశాలలపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఏ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలో తెలియక తల్లిదండ్రులు అయోమయంలో ఉన్నారు.

- మలక్‌పేట జోన్ పరిధిలోని సరూర్‌నగర్, సైదాబాద్‌ల్లో ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలు సుమారు 70కి పైగానే ఉన్నాయని అధికారులు అనధికారికంగా చెప్తున్నా.. వారి దృష్టికి రాని పాఠశాలలు మరెన్నో ఉన్నాయి. ఈ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుండగా వాటిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.
- ప్రతి సంవత్సరం గుర్తింపు లేని పాఠశాలను గుర్తిస్తున్నా వాటికి నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.
- కొన్ని పాఠశాలలు గుర్తింపు కోసం దరఖాస్తు చేశామని రసీదు చూపిస్తూ అడ్మిషన్లు ప్రారంభించాయి. ఒక్క పాఠశాలకు అనుమతి తీసుకొని మూడు, నాలుగు పాఠశాలలు నడుపుతున్న కార్పొరేట్ పాఠశాలలు కూడా ఉన్నాయి.
- మలక్‌పేట్‌జోన్ పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. సరైన తరగతి గదులతో పాటు విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలాలు, తాగునీరు, రవాణా వంటి కనీస సౌకర్యాలు లేవు. అయినప్పటికీ కార్పొరేట్ పాఠశాలల పేరుతో రూ. 50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు.
- విద్యాశాఖ అధికారుల ఉదాసీనత వల్లే గుర్తింపు లేని పాఠశాలలు ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్నాయని పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అధికారులు గుర్తింపు లేని పాఠశాలలను మూయించి వేయడం, గుర్తింపు లేని స్కూళ్ల జాబితాను ప్రకటించడం వంటివి చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుందంటున్నారు.

అనుమతి లేని స్కూళ్లపై కఠిన చర్యలు

అనుమతులు లేని, కనీస సౌకర్యాలు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. సరూర్‌నగర్, సైదాబాద్ మండలాల్లోని గుర్తింపు లేని పాఠశాలలకు గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేశాం. ఈ విద్యా సంవత్సరంలో మరోసారి అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు ఇస్తాం. మళ్లీ ఈ పాఠశాలలు కొనసాగితే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– సరూర్‌నగర్, సైదాబాద్ ఎంఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌లు

పాల ప్యాకెట్ కోసం వెళ్లి..

కళ్లముందే తండ్రి విగతజీవిగా పడి ఉండటాన్ని ఆ పసి హృదయం తట్టుకోలేకపోయింది. ఉబికి వస్తున్న దుఃఖం ..వచ్చీరాని మాటలతో నాన్నను.. లేపేందుకు ప్రయత్నిస్తూ గుండెలవిసేలా రోదించాడు. ఆ చిన్నారి గోసను చూసి స్థానికులు కళ్లు చెమర్చారు. ఈ విషాద సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మృతదేహం వద్ద విలపించిన రెండేళ్ల కుమారుడు


ఘటనా స్థలంలో కనకప్రసాద్ మృతదేహం.. చిత్రంలో రోదిస్తున్న కుమారుడు

అబ్దుల్లాపూర్‌మెట్: జీవనోపాధి కోసం సొంత ఊరును విడిచి నగరానికి వచ్చాడు. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోందని భావించాడు. కానీ రోడ్డు ప్రమాదం అతని ఆశల్ని చిదిమేసింది. రెండేళ్ల కుమారుడితో కలిసి పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లిన వ్యక్తిని అతి వేగంతో వచ్చిన వాహనం బలికొంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం అత్తివాడులు గ్రామానికి చెందిన శెట్టి కనకప్రసాద్(35) తన భార్య పిల్లలతో కలిసి మండలంలోని ఇనాంగూడలో ఉంటూ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు పాల ప్యాకెట్ కోసం తన ద్విచక్ర వాహనంపై రెండేళ్ల కుమారుడు శివకుమార్‌ను వెంట తీసుకుని అబ్దుల్లాపూర్‌మెట్ కూడలికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇనాంగూడ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న ఓ డీసీఎం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, అతని కుమారుడు శివకుమార్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెలవిసేలా రోదించిన బాలుడు

తనతో ముచ్చటిస్తూ వచ్చిన తన తండ్రి రోడ్డుపై విగతజీవిగా పడి ఉండడంతో.. ఏం జరిగిందో తెలియని చిన్నారి తండ్రి మృతదేహం పక్కనే కూర్చుని.. దిక్కులు చూస్తూ గుక్క పెట్టి ఏడ్చాడు. ఇది చూసిన వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన కొన్ని నిమిషాల్లోనే భర్త తనకు దూరమయ్యాడని సంఘటనా స్థలంలో మృతుడి భార్య గుండెలవిసేలా రోదించింది.